స్థానిక ఎన్నికలకు ఎన్ని వాయిదాలు?

మళ్లీ వాయిదా కోరడమేమిటి? • గత విచారణలోనూ వాయిదా కోరారు

ఆ హామీని ఎందుకు అమలు చేయలేదు? • రాష్ట్రప్రభుత్వాన్ని నిలదీసిన హైకోర్టు

మరో 30 రోజుల గడువు కోరిన సర్కారు • తీర్పును వాయిదా వేసిన న్యాయమూర్తి

హైదరాబాద్, జూన్ 23 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థలకు ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల కమిషన్‌ను హైకోర్టు నిలదీసింది. గత ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహిస్తామని ఇచ్చిన హామీ ఇచ్చి ఏమైందని ప్రశ్నించింది. గత డిసెంబర్‌లో జరిగిన విచారణ సమయంలో ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహిస్తామని హామీ ఇచ్చి ఎందుకు అమలు చేయలేదని అడిగింది. ఎన్నికలు ఎప్పుడు నిర్వహించేదీ తెలియజేసేందుకు మరో 25 లేదా 30 రోజుల గడువు కావాలని ప్రభుత్వం కోరడంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేసింది. ప్రభుత్వానికి 25 నుంచి 30 రోజుల సమయం ఇచ్చాక.. ఎన్నికల నిర్వహణకు తమకు సుమారు రెండు నెలల వ్యవధి అవసరమని రాష్ట్ర ఎన్నికల సంఘం చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘాల వాదనల అనంతరం తీర్పును తర్వాత వెలువరిస్తామని హైకోర్టు ప్రకటించింది.

కేంద్రం నిధులకు కోత

తొలుత పిటిషనర్ల తరపున న్యాయవాది జీ భాస్కర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 2024, జనవరి 31తో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిందని, ఇప్పటికి దాదాపు 18 నెలలు అయ్యిందని చెప్పారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల కాలపరిమితి ముగిసిన ఆరు నెలల్లోగా ఎన్నికలు నిర్వహించాలనే నిబంధనను ప్రభుత్వం ఉల్లంఘించిందని తెలిపారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి ఏడాదిన్నర అవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. తాజా మాజీ సర్పంచ్‌లను పక్కన పెట్టి గ్రామ పంచాయతీలను పర్యవేక్షించడానికి ప్రత్యేక అధికారులను నియమించడం ప్రజాస్వామ్యాన్ని కాలరాయడమేనని అన్నారు. ఇలా చేయడం రాజ్యాంగంలోని 243ఈ, 243కే అధికరణలను పాలకులు ఉల్లంఘించారని తెలిపారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం–2018 నిబంధనలకు ప్రభుత్వం తిలోదకాలిచ్చిందని చెప్పారు. ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేస్తున్న ప్రభుత్వం, చట్టాన్ని, రాజ్యాంగాన్ని ఉల్లంఘించిందని అన్నారు. విధిగా ఎన్నికలు నిర్వహించాలన్న రాజ్యాంగ అధికరణల స్ఫూర్తిని నీరుగార్చిందని అన్నారు. గత విచారణ సమయంలో కూడా ఎన్నికలు నిర్వహించేందుకు రెండు నెలల గడువు కోరిన ప్రభుత్వం మళ్లీ గడువు కోరడాన్ని తీవ్రంగా పరిణించాలని అన్నారు. ఎన్నికలు నిర్వహించేందుకు దాటవేత ధోరణిని అవలంబిస్తున్నదని చెప్పారు. ప్రత్యేక అధికారుల పాలనలో సమస్యలు పేరుకుపోతాయని, వాటిని పరిష్కరించడంలో తీవ్ర అలసత్వం నెలకొంటున్నదని, ఫలితంగా ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని చెప్పారు. దీనికితోడు ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల వివిధ పథకాలకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులకు కోత పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో పనులు చేపట్టేందుకు రాష్ట్ర ఆర్థిక సంఘం ద్వారా నిధులను అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో పలు గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు సర్పంచ్‌లు తమ సొంత డబ్బులు వెచ్చించారని తెలిపారు. తీరా నిధుల విడుదల లేకపోవడంతో సర్పంచ్‌లు చేతులు కాల్చుకున్నట్టు అయ్యిందని అన్నారు. తక్షణమే నిధుల్ని విడుదల చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అదే విధంగా వెంటనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేలా ఆదేశాలివ్వాలని విజ్ఞప్తిచేశారు. ఎన్నికలు నిర్వహించేందుకు ఇంకా గడువు కావాలనే యోచనలో ప్రభుత్వం ఉంటే ఎన్నికలు ఎన్విహించే వరకు సర్పంచ్‌లకు పాలనా బాధ్యతలు అప్పగించేలా మధ్యంతర ఆదేశాలు వెలువరించాలని అన్నారు. పంచాయతీలకు ప్రజలెన్నుకున్న పాలకవర్గాలు ఉండి తీరాలని సుప్రీం కోర్టు తీర్పులు ఉన్నాయని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేయకపోయినప్పటికీ ఎన్నికల సంఘం ఆ దిశగా చర్యలు తీసుకోవచ్చని చెప్పారు.

ఏం చేస్తున్నారు..?

వాదనలపై స్పందించిన హైకోర్టు, ఏడాదిన్నర కాలంగా ఎన్నికలు జరపకుండా ఏం చేస్తున్నారని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ప్రభుత్వం ఆలస్యం చేస్తే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎన్నికలు నిర్వహించే అధికారం రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఉంది కదా అని తెలిపింది. పోలింగ్ కేంద్రాలు, భద్రత వంటి అంశాల్లో ప్రభుత్వ సహకారం అవసరమని ఎన్నికల సంఘం జవాబు చెప్పింది. మాజీ సర్పంచులకు అధికార పగ్గాలు ఇవ్వాలన్న అభ్యర్థనను వ్యతిరేకించిన హైకోర్టు, తీర్పును వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది.

నెల రోజుల గడువు ఇవ్వండి

స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేయాలంటూ నల్లగొండ జిల్లా మల్లేపల్లి మాజీ సర్పంచ్ పార్వతి, కుర్మపల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్, జనగాం జిల్లా కంచనపల్లి మాజీ సర్పంచ్ విజయ, నిర్మల్ జిల్లా తల్వెడ మాజీ సర్పంచ్ అనిల్‌కుమార్, కరీంనగర్ జిల్లా చంగర్ల మాజీ సర్పంచ్ వేణుగోపాల్, నిజాయతీగూడెం మాజీ సర్పంచ్ మురళీధర్ దాఖలు చేసిన వేర్వేరు వ్యాజ్యాలపై జస్టిస్ టీ మాధవీదేవి సోమవారం విచారణ జరిపారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లను ఖరారు చేసి ఎన్నికలకు సమాయత్తం అయ్యేందుకు సుమారు నెల గడువు అవసరమని అదనపు ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ చెప్పారు. ఎన్నికలు నిర్వహించేందుకు సర్కారు కసరత్తు చేస్తున్నదని, సమగ్రంగా ప్రక్రియను పూర్తిచేసేందుకు కొంత వ్యవధి అవసమని అన్నారు. దీనిపై రాష్ట్ర ఎన్నికల సంఘం తరపు సీనియర్ న్యాయవాది విద్యాసాగర్ స్పందిస్తూ, ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు లభించిన తర్వాత స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు తమకు రెండు మాసాల సమయం అవసరమని చెప్పారు. ప్రభుత్వం నుంచి చట్ట ప్రకారం అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తే, ఎన్నికల సంఘం వైపు ఏర్పాట్లు చేసేందుకు రెండు నెలల సమయం అవసరమని, ఆ తర్వాత ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు.

లోకం పోకడ



వానా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	38.2°c	23.5°c
నల్లగొండ	38.0°c	22.7°c
రంగారెడ్డి	37.0°c	22.1°c
నిజామాబాద్	35.6°c	27.1°c
ఖమ్మం	34.0°c	26.0°c
కరీంనగర్	34.0°c	27.0°c
మెదక్	32.8°c	25.2°c
హైదరాబాద్	32.4°c	24.0°c
వరంగల్	32.0°c	26.0°c
మహబూబ్‌నగర్	32.0°c	25.0°c

తెలంగాణ రియల్ ఎస్టేట్ అప్పిలేట్

ట్రిబ్యునల్ చైర్మన్‌గా జస్టిస్ సంతోష్‌రెడ్డి

జస్టిస్ అనుగు సంతోష్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 23 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రియల్ ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (టీఆర్‌ఈఏటీ) చైర్మన్‌గా జస్టిస్ అనుగు సంతోష్‌రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.దీంతో సోమవారం ఆయన హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) చైర్మన్, సభ్యులు జస్టిస్ సంతోష్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. జగిత్యాల జిల్లాలోని జోగన్‌పల్లి జస్టిస్ సంతోష్‌రెడ్డి స్వగ్రామం. ఆయన తండ్రి దివంగత అనుగు నారాయణరెడ్డి మాజీ ఎమ్మెల్యే.జగిత్యాలలో డిగ్రీ, అనంతపురంలోని శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో లా చదివిన జస్టిస్ సంతోష్‌రెడ్డి.. హైదరాబాద్‌లోని ఉస్మానియా వర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో మాస్టర్స్ పూర్తి చేశారు. 1985లో అడ్వకేట్‌గా నమోదై కరీంనగర్ జిల్లాలో ప్రాక్టీస్ ప్రారంభించారు. 2022 మార్చి 24న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఆయన న్యాయ సేవలను ప్రభుత్వం గుర్తించి టీఆర్‌ఈఏటీ చైర్మన్‌గా నియమించింది.

బిల్లుల కోసం హైకోర్టుకెళ్తం

తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి వెల్లడి

హైదరాబాద్, జూన్ 23 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేలోగా పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, లేకుంటే మరోసారి హైకోర్టును ఆశ్రయిస్తామని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్రంలో సర్పంచుల కాలవ్యవధి ముగిసి ఏడాదిన్నర కావొస్తున్నా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా స్థానిక సంస్థల పాలనను అటకెక్కించిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

జీపీ ట్రాక్టర్‌లో డీజిల్ పోసే దిక్కులేదు

- **బల్బులు కాలినా మార్చే నాథుడు లేడు**
- **నీటి పైప్‌లైన్లు పగిలినా సరిచేయరు**
- **మాజీ మంత్రి హరీశ్ ఎదుట సమస్యలను ఏకరువు పెట్టిన చిప్పల్‌తుర్తి గ్రామస్థులు**
- **3 నెలలుగా మాకు జీతాల్లేవు సారు**
- **గోడు వెళ్లబోసుకున్న జీపీ కార్మికులు**
- **అప్పు తెచ్చి పెట్టినం.. ఆ డబ్బు ఎట్ల రావాలె?**
- **హరీశ్ ఎదుట వాపోయిన కార్యదర్శి**
- **కేసీఆర్ ఆనవాళ్లను చెరపడమంటే ఇదేనా?**
- **ధ్వజమెత్తిన మాజీ మంత్రి హరీశ్‌రావు**

నర్సాపూర్, జూన్ 23 : ఏడాదిన్నరలోనే రాష్ట్రంలోని పంచాయతీల్లో కాంగ్రెస్ సర్కారు తెచ్చిన 'చెత్త' మార్పునకు.. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం చిప్పల్‌తుర్తి సాక్ష్యంగా నిలిచింది. గ్రామానికి గత సీఎం కేసీఆర్ అందించిన జీపీ ట్రాక్టర్‌కు ఘనత వహించిన రేవంత్ ప్రభుత్వం కనీసం డీజిల్ కూడా అందించలేని దుస్థితితో వాహనం మూలకుపడింది. ఫలితంగా పంచాయతీ కార్యాలయం వద్ద నిలిపి ఉంచిన ట్రాక్టర్ కాస్తా చెత్త డబ్బాలా మారింది. సోమవారం ఈ ఊరిలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డితో కలిసి పర్యటించిన మాజీ మంత్రి హరీశ్‌రావు, పంచాయతీ కార్యాలయం వద్ద చెత్త లోడ్‌తో మూలకు పడి ఉన్న ట్రాక్టర్‌ను చూసి షాక్ అయ్యారు. అక్కడే ఉన్న పారిశుధ్య కార్మికులు, గ్రామస్థులను ఊరి పరిస్థితి గురించి హరీశ్ ఆరా తీయగా వారంతా తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ట్రాక్టర్‌లో డీజిల్ పోయలేక చెత్త తీయడం లేదని, తమకు జీతాలు కూడా రావడం లేదని పారిశుధ్య కార్మికులు వాపోయారు. ట్రాక్టర్‌లో డీజిల్ లేక చెత్త తీయకపోవడంతో గ్రామస్థులు తమపై కోపానికి వస్తున్నారని చెప్పారు. కొత్త ప్రభుత్వం వచ్చినప్పటి నుంచీ ట్రాక్టర్‌కు ఆయిల్, ఫిల్టర్ చేంజ్ చేయలేదని, సర్వీసింగ్ కూడా చేయలేదని, బీమా, రోడ్ ట్యాక్స్ కట్టలేదని, చివరికి డీజిల్‌కు డబ్బులేక బండి తాళాలను ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీకి అప్పగించామని తెలిపారు. పగిలిన మంచినీటి పైప్‌లైన్‌ను సరిచేయడం లేదని, విద్యుత్తు దీపాలు సరిగ్గా వెలగడం లేదని గ్రామస్థులు చెప్పుకొచ్చారు. 20 రోజులుగా ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి గ్రామమంతా కంపు కొడుతున్నదని, అసలే వానకాలం కావడంతో ఎక్కడ రోగాలు ప్రభలుతాయేమోనని భయపడుతున్నామని ఆందోళన వ్యక్తంచేశారు.

80 వేలు అప్పుతెచ్చి పెట్టినం: జీపీ కార్యదర్శి

గ్రామంలో సమస్యలను ఎందుకు పరిష్కరించడం లేదని అక్కడే ఉన్న పంచాయతీ కార్యదర్శిని హరీశ్ ప్రశ్నించగా ఇప్పటికే తాను మిత్తికి అప్పు తెచ్చి రూ.80 వేలు పంచాయతీకి పెట్టానని తెలిపారు. 'నా జీతం 30 వేల రూపాయలు.. నేను అప్పు తెచ్చి పెట్టిన డబ్బులు ఎట్ల వస్తయో అర్థం కావడం లేదు' అంటూ వాపోయారు.

డీజిల్ పోయకపోవడమే మార్పా ?: హరీశ్

గ్రామస్థుల మొర విన్న అనంతరం హరీశ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ అందించిన పంచాయతీ ట్రాక్టర్లకు కనీసం డీజిల్ కూడా పోయలేని దుస్థితిలో కాంగ్రెస్ సర్కారు ఉన్నదని ఎద్దేవాచేశారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని పల్లెపల్లెకు తేవాలని ప్రతీ పంచాయతీకి ట్రాక్టర్, ట్యాంకర్, ట్రాలీ, ఇంటింటికి చెత్త బుట్టలు ఇచ్చి, డంపింగ్ యార్డులు కట్టించి కేసీఆర్ స్వచ్ఛమైన పల్లెలను తయారుచేస్తే రేవంత్ సర్కారు కనీసం ట్రాక్టర్లలో డీజిల్ కూడా పోయడం లేదని మండిపడ్డారు. 'మార్పు మార్పు అన్నరు.. ఇదేనా మార్పు? కేసీఆర్ ఇచ్చిన ట్రాక్టర్లను మూలకు పడేయడం మార్పా? ట్రాక్టర్‌లో డీజిల్ పోయకపోవడం మార్పా? అని నిలదీశారు. 'కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానన్నవు.. ట్రాక్టర్‌ను మూలన పడేయడమా? బుగ్గలు వేయకపోవడమా? ఆనవాళ్లు లేకుండా చేయడమంటే?' అని దెప్పిపొడిచారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు కోటలు దాటుతున్నాయని, చేతలు మాత్రం గడపదాటడం లేదని విమర్శించారు. తాగునీటి పైప్‌లైన్ పగిలితే మరమ్మతు చేయలేని దుస్థితి నెలకొన్నదని అసహనం వ్యక్తం చేశారు. మూడు నెలల నుంచి జీతాలివ్వకుంటే పారిశుధ్య కార్మికులు తమ కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. ఒకటో తేదీ నాడే జీతాలు అని రేవంత్‌రెడ్డి అంటున్నాడని, అందరిలో పేద ఉద్యోగులైన పారిశుధ్య కార్మికులకు జీతాలిచ్చే తెలివి ప్రభుత్వానికి లేదా? అని నిలదీశారు. పంచాయతీ సెక్రటరీలను పలకరిస్తే వారి బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయని వాపోయారు. 'రాష్ట్రం అస్తవ్యస్తమవుతున్నది. రేవంత్‌రెడ్డీ.. ఇప్పటికైనా కండ్లు తెరువు' అని హరీశ్ తీవ్రంగా హెచ్చరించారు.

మెదక్ జిల్లాలోని చిప్పల్‌తుర్తి గ్రామంలో చెత్తట్రాక్టర్‌ను పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

తప్పు సర్కారుది.. శిక్ష కార్యదర్శికి

నర్సాపూర్, జూన్ 23 : తప్పు రేవంత్ సర్కారుది అయితే.. శిక్ష పంచాయతీ కార్యదర్శికి పడింది. మెదక్ జిల్లా నర్సాపూర్ మండల పరిధిలోని చిప్పల్‌తుర్తి పంచాయతీ సెక్రటరీకి కలెక్టర్ సోమవారం మెమో జారీ చేశారు. డీజిల్ లేక పంచాయతీ ట్రాక్టర్‌ను 20 రోజులుగా మూలకు పడేశారన్న కారణంతో కార్యదర్శికి మెమో జారీ చేసినట్టు తెలిసింది. చిప్పల్‌తుర్తిలో బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమానికి సోమవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డితో కలిసి మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఊరిలో సమస్యలు తెలుసుకునేందుకు గ్రామస్థులను కలిసి ఆరా తీశారు. చెత్త లోడ్‌తో పంచాయతీ కార్యాలయం వద్దే మూలకు పడి ఉన్న జీపీ ట్రాక్టర్‌ను చూసి అవాక్కయ్యారు. అక్కడే ఉన్న పారిశుధ్య కార్మికుల ద్వారా పరిస్థితిని తెలుసుకున్నారు. 'సర్కారు గాసమిస్తలేదు.. అందుకే డీజిల్ లేక ట్రాక్టర్ తీస్తలేం.. చెత్త ఎత్తుత లేమని ఊరోళ్లు మామీదికి కోపానికొస్తుండ్రు..

డీజిల్‌కు డబ్బులేక బండి తాళాలను ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీకి అప్పగించినం' అని సిబ్బంది తెలిపారు. అక్కడే ఉన్న పంచాయతీ కార్యదర్శితో హరీశ్ మాట్లాడి కారణాలను తెలుసుకున్నారు. గ్రామంలో సమస్యలు ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. పంచాయతీ సెక్రటరీ బదులిస్తూ ఇప్పటికే తాను మిత్తికి అప్పు తెచ్చి రూ.80 వేలు పంచాయతీకి పెట్టానని తెలిపారు. డీజిల్ లేక ట్రాక్టర్ మూలకు పడిన విషయంలో సాయంత్రానికల్లా కార్యదర్శిని బాధ్యులుగా చేస్తూ కలెక్టర్ మెమో జారీ చేశారు.

ప్రభుత్వం నిధులివ్వకపోవడం వల్లే ట్రాక్టర్‌లో డీజిల్ లేక చెత్త సేకరించడం లేదని, రేవంత్ సర్కార్ నిధులిస్తే ట్రాక్టర్‌లో డీజిల్ పోసేవారు కదా అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. నెలనెలా నిధులు రాక పంచాయతీల అభివృద్ధి కుంటుపడుతున్నదని, దీనికి పంచాయతీ సెక్రటరీలను బలిచేయడం ఏమిటని నిలదీస్తున్నారు. పంచాయతీల్లో నిధులుంటే ట్రాక్టర్ల నిర్వహణ, చెత్త సేకరణ, వీధి దీపాలు, పైప్‌లైన్ రిపేర్లు తదితర పనులు సక్రమంగా జరుగుతాయని, నిధుల్లేక తాము బయట వడ్డీలకు డబ్బు తెచ్చి.. బంగారం కుదవ పెట్టి మరీ గ్రామాల్లో మరమ్మత్తులు చేయిస్తున్నామని పలువురు పంచాయతీ సెక్రటరీలు వాపోతున్నారు. రూ.80 వేలు అప్పుతెచ్చి గ్రామాభివృద్ధికి ఖర్చు చేసిన చిప్పల్‌తుర్తి పంచాయతీ కార్యదర్శిని ప్రభుత్వం అభినందించాల్సింది పోయి మెమో జారీ చేయడం ఏమిటని మండిపడుతున్నారు. ప్రభుత్వం చేసే తప్పులకు అధికారులను బలిచేస్తారా? అని ప్రశ్నిస్తున్నారు. తోచిన విధంగా గ్రామాలను నెట్టుకొస్తున్న వారికి మెమోలు, షోకాజ్ నోటీసులు జారీ చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీస్తున్నారు. ఇప్పటికైనా చిప్పల్‌తుర్తి కార్యదర్శికి ఇచ్చిన మెమోను వెనక్కి తీసుకోవాలని, లేదంటే ఆందోళనలకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

అర్వింద్ అహంకారం పాతాళానికే..

మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం

మోర్తాడ్, జూన్ 23: అధికార మదంతో విర్రవీగుతున్న నిజామాబాద్ బీజేపీ ఎంపీ అర్వింద్ అహంకారాన్ని ప్రజలు త్వరలోనే పాతాళానికి తొక్కేస్తారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అర్వింద్ చేసిన వ్యాఖ్యలను ఆయన సోమవారం ఓ ప్రకటనలో ఖండించారు. ఐదు దశాబ్దాలుగా ప్రజాసేవలో ఉండి, చావు నోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చిన గొప్ప వ్యక్తిని విమర్శించడానికి ఎంపీ అర్వింద్‌కు ఏమాత్రం అర్హత లేదని మండిపడ్డారు. తండ్రి వయసున్న కేసీఆర్‌పై, తెలంగాణ ఉద్యమకారులైన కేటీఆర్, హరీశ్‌రావు, కవితపై వ్యక్తిగత హననం చేస్తూ అర్వింద్ చేసిన దిగజారుడు వ్యాఖ్యలు ఆయన స్థాయిని సూచిస్తున్నాయని చెప్పారు. సింహం లాంటి కేసీఆర్ పై గాడిదలాగా ఓండ్ర పెడుతున్న అర్వింద్ అహంకారాన్ని ప్రజలు తొందరలోనే పాతరేస్తారన్నారు. 'మీ నాన్న డీ శ్రీనివాస్ రాజకీయంగా సమాధి అనుకున్న సమయంలో మళ్లీ ఎంపీని చేసి వెలుగులోకి తెచ్చింది కేసీఆర్' అని గుర్తు చేశారు. నీ మొఖానికి ఎవరు ఓట్లు వేయరని 'నన్ను చూసి కాదు.. మోదీని చూసి బీజేపీకి ఓట్లు వేయండి' అని అడుక్కొని యాక్సిడెంటల్ ఎంపీ అయిన విషయం గుర్తులేదా? అని ప్రశ్నించారు. 'బనకచర్ల'ను జనకచర్లగా అనడం, ఇరిగేషన్‌పై అవగాహన లేకుండా అర్వింద్ మాట్లాడిన మాటలతోనే ఆయన స్థాయి ప్రజలకు అర్థమైందన్నారు.

అర్వింద్.. ఒక కుసంస్కారి

ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఖిలీల్‌వాడి, జూన్ 23: నిజామాబాద్ బీజేపీ ఎంపీ అర్వింద్.. ఒక కుసంస్కారి అని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితను ఉద్దేశించి అర్వింద్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. అవినీతి బురద గుంట ఫ్యామిలీలో పుట్టిన అర్వింద్.. కేసీఆర్ ఫ్యామిలీని తిట్టి పెద్ద నాయకుడివై పోవాలనుకుంటున్నావా? అని ప్రశ్నించారు. తెలంగాణ తెచ్చినందుకు కేసీఆర్‌ను జైల్లో పెడతారా? తెలంగాణను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపినందుకు విమర్శిస్తారా అని మండిపడ్డారు. కేసీఆర్, కేటీఆర్, కవిత కాలిగోటికి కూడా అరవింద్ సరిపోడన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీనే రప్పరప్ప అని తరిమికొడతారని ధ్వజమెత్తారు. గుజరాత్ గులామ్‌లా మాట్లాడకుండా తెలంగాణ సోయి తెచ్చుకోవాలని హితవు పలికారు. కేసీఆర్ తెలంగాణ సూర్యుడని, ఆయనతో పెట్టుకుంటే మసి కాక తప్పదని హెచ్చరించారు.

సమస్యలను పరిష్కరించాలంటూ ఇల్లెందు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, ఉద్యమనేత దిండిగాల రాజేందర్, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు

కాంగ్రెస్ పాలనలో బ్లీచింగ్ చల్లే దిక్కులేదు

- **పల్లెల్లో పారిశుద్ధ్యం లోపించినా పట్టించుకున్న పాపానపోలేదు**
- **రేగా కాంతారావు పిలుపుతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ధర్నాలు**

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 23 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నరగా పల్లెలను పట్టించుకున్న పాపానపోలేదని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు విమర్శించారు. కాలువల వెంట కనీసం బ్లీచింగ్ చల్లే దిక్కు లేదని దుయ్యబట్టారు. వర్షాలు మొదలై పల్లెల్లో పారిశుద్ధ్యం లోపిస్తున్నా నివారణ చర్యలులేవని ధ్వజమెత్తారు. పల్లెల్లోని సమస్యలను పరిష్కరించాలని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, ఆరు గ్యారెంటీలను అమలుచేయాలని, 420 హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పిలుపుమేరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా సోమవారం ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆయా సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. పాలకవర్గాలు లేని కారణంగా పంచాయతీల అభివృద్ధి కుంటుపడుతున్నదని, గ్రామాల్లో బ్లీచింగ్ చల్లించకపోవడం, మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడం, చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలించకపోవడంతో పారిశుధ్యం లోపించిందని ధ్వజమెత్తారు. వర్షాలు కురుస్తుండడంతో పల్లెల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నా నివారణకు చర్యలు తీసుకోలేదని దుయ్యబట్టారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో పారదర్శకత లేదని, జాబితాల నిండా అనర్హులేనని విమర్శించారు. భద్రాద్రి జిల్లాలో పల్లెల దుస్థితి గడిచిన 18 నెలలుగా 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే..' అన్నచందంగా ఉందని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా స్పందించి ఆయా సమస్యలను పరిష్కరించకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

బిల్లు ముఖ్యమా.. ప్రాణం ముఖ్యమా?

నేను ఎమ్మెల్యే అనుచరుడిని

నాతో పెట్టుకుంటే టార్చర్ తప్పదు

విద్యుత్తు సిబ్బందికి బెదిరింపు

వైరల్‌గా మారిన యువకుడి ఆడియో

గంగాధర, జూన్ 23: 'నేను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దగ్గర పని చేస్తున్నా.. నాతో పెట్టుకుంటే టార్చర్ తప్పదు. నీకు ప్రాణం ముఖ్యమా, బిల్లు ముఖ్యమా?.. నాతో పెట్టుకుంటే అంతు చూస్తా..' అంటూ ఓ యువకుడు విద్యుత్తు సిబ్బందిని బెదిరించిన ఓ వాయిస్ రికార్డ్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కోట్లనర్సింహులపల్లికి చెందిన ఓ యువకుడు ఏడాదికాలంగా విద్యుత్తుబిల్లు చెల్లించడంలేదు. సోమవారం సదరు యువకుడి ఇంటికి వెళ్లిన విద్యుత్తుసిబ్బంది కరెంటు బిల్లు చెల్లించుకుంటే కనెక్షన్ కట్ చేస్తామని చెప్పారు. దీంతో సదరు యువకుడు విద్యుత్తు సిబ్బందితో తాను ఎమ్మెల్యే అనుచరుడిని అంటూ బెదిరించాడు. ఈ విషయమై విద్యుత్తు సిబ్బందిని వివరణ కోరగా బిల్లు చెల్లించాలని కోరితే సదరు య